
సాక్షి నంద్యాల

ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం విశాఖపట్నంకు చెందిన జి.కస్తూరి రూ.1,00,116 విరాళంగా అందజేశారు.



ధనుర్మాస పూజలు

మంత్రాలయం: కర్ణాటక రాష్ట్రం ఉడిపి శ్రీకృష్ణ క్షేత్రంలో శనివారం శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు చేశారు. రాములోరి తీర్థ ప్రసాదాలను స్వామిజీ విద్యాసాగర తీర్థులకు అందజేశారు.



క్షణికావేశం మృత్యుపాశమై

క్షణికావేశంలో ఇద్దరు బిడ్డలను తల్లి నిర్దాక్షిణ్యంగా హతమార్చింది. తను కూడా ఆత్మహత్యకు యత్నించింది. ఈ విషాద ఘటన హొళ్వి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. 8లో▸

న్యూస్‌రీల్

‘స్పందన’ రద్దు

నంద్యాల: జనవరి 1వ తేదీన నిర్వహించాల్సిన జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల పట్టణం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే ఈ కార్యక్రమం అనివార్య కారణాల వల్ల రద్దు చేస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు.

1.019 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి

శ్రీశైలంప్రాజెక్ట్: తెలంగాణ ప్రాంతంలోని ఎడమగట్టు భూగర్భజలవిద్యుత్ కేంద్రంలో శుక్రవారం నుంచి శనివారం వరకు 1.019 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం నాగార్జున సాగర్‌కు 2,170 క్యూసెక్కుల నీటిని వదిలారు. జలాశయానికి కొంత కాలంగా ఇన్‌ఫ్లో నిలిచిపోయిన విషయం తెలిసిందే. జలాశయం నుంచి హంద్రీనీవా సుజలస్రవంతికి 960 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 735 క్యూసెక్కులు వదిలారు. శనివారం జలాశయంలో 50.0072 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్ నీటిమట్టం 830.50 అడుగులకు చేరుకుంది.

ధర్మకర్తల మండలి సమావేశం వాయిదా

మహానంది: మహానంది దేవస్థానం కార్యాలయంలో శనివారం జరగాల్సిన ఆలయ ధర్మకర్తల మండలి సమావేశం వాయిదా వేసినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. తదుపరి సమావేశం తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. మహానంది దేవస్థానంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై పరిశీలించి చర్చించే కార్యక్రమంలో భాగంగా మరోసారి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈవీఎంల గోదాముపై నిరంతర నిఘా

- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



హాజరు పట్టికను పరిశీలిస్తున్న కలెక్టర్

నంద్యాల: జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద నిరంతరం పటిష్ఠమైన నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత సెక్యూరిటీ అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా నంద్యాల పట్టణం టెక్కె మార్కెట్ యార్డ్‌లో ఉన్న ఈవీఎం గోదామును శనివారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల సమక్షంలో గోదాము లోపల భద్రపరిచిన ఆయా ఈవీఎం యంత్రాలు బీయూ, సీయూలు, వీవీ ప్యాట్‌లను, అక్కడి భద్రతా చర్యలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఫైర్ సేఫ్టీ, లాక్ సిస్టమ్ తదితర అంశాలను కూడా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి 2,030 కంట్రోల్ యూనిట్లు, 2,509 బ్యాలెట్ యూనిట్లు, 2,452 వీవీ ప్యాట్లు, అలాగే అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 1,924 కంట్రోల్ యూనిట్లు, 2,520 బ్యాలెట్ యూనిట్లు, 2,451 వీవీ ప్యాట్లు మొదటి దఫా పరిశీలన పూర్తిచేసుకుని ఓటింగ్ ప్రక్రియకు సిద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లాకు మొత్తంగా 4,893 బీయూ, 4,220 సీయూలు, 4,847 వీవీ ప్యాట్‌లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పుల్లయ్య, ఆర్‌డీఓ శ్రీనివాసులు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, టీడీపీ పార్టీ నుంచి శివరామిరెడ్డి, ఇండియన్ కాంగ్రెస్ పార్టీ తరుపున రియాజ్ బాషా, సీపీఎం తరుపున నరసింహ ఉన్నారు.

ఐదుగురికి కరోనా పాజిటివ్

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో మరో ఐదుగురికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో కోవిడ్ పరీక్షలు నిర్వహించగా ఓర్వకల్లులో ముగ్గురు, లొద్దిపల్లి గ్రామంలో ఒకరు, కర్నూలు నగరంలోని బుధవారపేటలో ఒకరికి కోవిడ్ పాజిటివ్ ఉన్నట్లు తేలింది.



ప్రభం'జనం'.. నంద్యాల సాధికార సభకు పోటెత్తిన అశేషజనం

సాధికార సంబరం

- వైఎస్సార్‌సీపీ బస్సు యాత్రకు జన నీరాజనం
- జన జాతరను తలపించిన నంద్యాల
- ప్రభుత్వం చేసిన మేలును వివరించిన మంత్రులు, ప్రజాప్రతినిధులు
- బంగారు భవిష్యత్‌కు మళ్లీ జగనన్నను గెలిపించుకుందామని పిలుపు
- బైక్ ర్యాలీతో నేతలకు స్వాగతం
- ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు

సామాజిక చైతన్యం వెల్లివిరియగా.. సాధికార సంబరం అంబరాన్నంటింది. జయహో జగనన్న నినాదాలు హోరెత్తగా నవ నందుల కోట పులకించింది. దారులన్నీ జన కెరటాలు కాగా.. గాంధీచౌక్ అభిమాన సంద్రంగా మారింది. సంక్షేమ పథకాలు అందుకున్న జనం చేతిలో జెండాలు రెపరెపలాడాయి. శనివారం నంద్యాల పట్టణంలో సామాజిక సాధికార యాత్ర జనజాతరను తలపించింది. మంత్రులు, ప్రజాప్రతినిధుల ప్రసంగాలు ఉత్తేజాన్ని నింపాయి. మంచి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకుందామని పిలుపునిచ్చారు.



యువోత్సాహం.. బైక్ ర్యాలీలో అభిమానుల సందడి



ఫ్యాన్ స్పీడ్.. వేదికపై నుంచి ఫ్యాన్ మళ్లీ గిరగిరా తిప్పుదామంటూ పిలుపునిస్తున్న డిప్యూటీ సీఎంలు అంజాద్‌బాషా, నారాయణ స్వామి, మాజీ మంత్రి అనికుల్‌కుమార్ యాదవ్, శిల్పా మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవి, హఫీజ్‌ఖాన్, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి తదితరులు

నంద్యాల: బడుగు, బలహీన వర్గాల వారిని ఆత్మీయంగా పలకరించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు నంద్యాల నియోజకవర్గ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తామంతా సంక్షేమ సారథి వైపు అన్నట్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ప్రభంజనమై కదం తొక్కారు. సామాజిక నినాదంతో నంద్యాల పట్టణం మార్మోగింది. అక్కచెల్లెమ్మలు, యువత, అవ్వాతాతలు జేజేలు పలుకుతూ సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటామని కరతాళధ్వనులతో చాటి చెప్పారు. బస్సు యాత్రతో శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పట్టణం కిక్కిరిసిపోయింది. పట్టణంలోని నూరజ్ గ్రాండ్ హోటల్ నుంచి ర్యాలీతో బస్సు యాత్ర ప్రారంభమైంది. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, డిప్యూటీ సీఎంలు అంజాద్‌బాషా, నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి, రాష్ట్ర ముస్లిం మైనారిటీ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, ఉమ్మడి కడప జిల్లా జడ్పీచైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి శ్రీనివాససెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం శ్రీనివాస సెంటర్ నుంచి గాంధీచౌక్ వరకు పాదయాత్రతో గాంధీచౌక్‌కు చేరుకున్నారు. బస్సు యాత్ర వెంట వేలాది మంది బడుగు బలహీన వర్గాల ప్రజలు ముందుండి నడిపించారు. జై జగన్.. మళ్లీ జగనన్నే రావాలంటూ కార్యకర్తల నినాదాలు హోరెత్తాయి. బస్సు యాత్ర ముందు కళాకారుల నాట్యాలు, డప్పుల వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. యువత బాణాసంచా పేలుస్తూ సందడి చేశారు. అనంతరం నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మంత్రులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను సీఎంను చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శిల్పా మహిళా సహకార్ చైర్‌పర్సన్ శిల్పానాగినిరెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, బెస్త సంఘం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, దృశ్య కళల అకాడమీ డైరెక్టర్ సునీతా అమృతరాజ్, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, వైఎస్సార్‌సీపీ నాయకులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జనహోరు.. బహిరంగ సభకు తరలివస్తున్న ప్రజలు (ఇన్‌సెట్లో) గిరిజన కళాకారుల నృత్యం

సంక్షేమ సారథికి అండగా నిలవాలి

రాబోయే ఎన్నికలు పేదరికానికి, పెత్తందారి మనస్తత్వం కలిగిన చంద్రబాబు మధ్య జరిగే యుద్ధం. ఈ యుద్ధంలో పేదల అభివృద్ధి కోసం పాటు పడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇచ్చి ఎన్నికలకు రాబోతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆదరిద్దాం. నంద్యాల జిల్లా, మెడికల్ కాలేజీ కలను సాకారం చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఎన్నో సంక్షేమ పథకాలతో పేదల ఇంట్లో వెలుగులు నింపారు. చంద్రబాబుకు ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ముస్లింలు గుర్తుకు వస్తారు. రాజకీయాల్లోకి ప్రజలకు సేవ చేయడానికే శిల్పా కుటుంబం వచ్చింది. ఒక్క రూపాయి కూడా ప్రజల సొమ్ము ఆశించకుండా నిజాయితీతో విలువలతో కూడిన రాజకీయం చేస్తున్నాం. రెండోసారి వైఎస్ జగన్‌ను సీఎంగా, నాలుగోసారి శిల్పా కుటుంబాన్ని గెలిపించుకుందాం.

– శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్యే, నంద్యాల



సంక్షేమ జెండా.. వైఎస్సార్‌సీపీ జెండాతో యువకుడు



బస్సుపై నుంచి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యేలు శిల్పా, కాటసాని రాంభూపాల్‌రెడ్డి తదితరులు

నంద్యాల ప్రజలు మంచికే ఓటేస్తారు

శిల్పా కుటుంబాన్ని ఊరిడిపిస్తాం... అంటూ రెచ్చగొట్టే మాట్లాడుతున్న టీడీపీ నాయకులు ఇకపై నోరు అదుపులో పెట్టుకోవాలి. నేను ఎన్నో ఫ్యాక్షన్ రాజకీయాలను చూశా. ఇప్పుడు ఎన్నికలు రాబోతున్నాయి. ఆట మొదలైంది. ఎన్నికల్లో ఎవరి సత్తా ఏమిటో తెలుస్తుంది. అంత వరకు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడితే మంచిది. నంద్యాల ప్రజలు మంచికే ఓటేస్తారు, రెచ్చగొట్టే మాట్లాడే నాయకులను ప్రజలు తరిమికొట్టిన విషయం గుర్తించుకోవాలి. 29 ఏళ్ల నుంచి నంద్యాలలో శిల్పాకుటుంబాన్ని ఆదరిస్తున్న ప్రజలను ఎప్పటికీ మరిచిపోం. వారికి సేవ చేయడమే మా ధ్యేయం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ప్రజలకు అన్నిరంగాల్లో పెద్దపీట వేసి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేస్తున్నారు. ఇలాంటి ముఖ్యమంత్రిని మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– శిల్పా మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి, నంద్యాల

ముస్లిం మైనార్టీలకు పెద్దపీట

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మైనార్టీలకు అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యత దక్కింది. నామినేటెడ్ పదవుల్లో సైతం మైనార్టీలకు సీఎం జగన్ పెద్దపీట వేశారు. నంద్యాల నియోజకవర్గం నుంచి తనకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంతో పాటు మున్సిపల్ చైర్మన్, రాష్ట్ర మైనార్టీ ప్రభుత్వ సలహాదారు వంటి ముఖ్యమైన పదవులను మైనార్టీలకు ఇచ్చారు. పదవులే కాకుండా సంక్షేమ లబ్ధిలోనూ మైనార్టీలు లబ్ధిపొందారు. ఇలాంటి సీఎంకు మైనార్టీలు అందరూ అండగా ఉండాలి. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం.

– ఇసాక్‌బాషా, ఎమ్మెల్సీ, నంద్యాల

టీడీపీ భూస్థాపితం

వచ్చే ఎన్నికల్లో ప్రజలు టీడీపీని భూస్థాపితం చేస్తారు. జగనన్న సైనికులుగా బస్సుయాత్రకు తాము వస్తేనే వేలాది మంది ప్రజలు వచ్చారంటే రేపు జగనన్న వస్తే ఎలా ఉంటుందో చూస్తే చంద్రబాబుకు గుండెపోటు రావడం ఖాయం. 29 సంవత్సరాలుగా స్వార్థం లేకుండా సొంత ఖర్చులతో సేవా కార్యక్రమాలు చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో సైతం భారీ మెజార్టీతో గెలిపించాలి. ఇక్కడికి వచ్చిన ప్రజల ఆదరణ చూస్తుంటే శిల్పారవి 50 వేల మెజార్టీతో గెలుపొందడం ఖాయం.

– హఫీజ్‌ఖాన్, ఎమ్మెల్యే, కర్నూలు

జగన్‌తోనే ముస్లింలకు న్యాయం

ముస్లింల హక్కుల కోసం న్యాయపరంగా పోరాడుతూ చంద్రబాబు సభలో ప్లకార్డులు ప్రదర్శించగా నాతో పాటు మరో కొంత మంది ముస్లిం యువకులపై దేశద్రోహం కేసు పెట్టి జైలులో వేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రోజు నాకు రాష్ట్ర ముస్లిం మైనార్టీ ప్రభుత్వ సలహాదారు వంటి కేబినెట్ ర్యాంకు వంటి పదవిని కట్టబెట్టారు. నంద్యాలలోనే ఓ ముస్లిం మహిళను మున్సిపల్ చైర్‌పర్సన్‌గా, ఎమ్మెల్సీ, మార్కెట్‌యార్డు చైర్మన్ తదితర కీలకమైన పదవులను మైనార్టీలకు కట్టబెట్టి న్యాయం చేశారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్న జగన్ మళ్లీ సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉంది.

– డీఎస్ హబీబుల్లా, రాష్ట్ర ముస్లిం మైనార్టీ ప్రభుత్వ సలహాదారు, నంద్యాల

జగన్ వెంటే బడుగు, బలహీన వర్గాలు

- 17 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మంత్రి వర్గంలో స్థానం
- సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం
- ఉప ముఖ్యమంత్రులు అంజాద్‌బాషా, నారాయణస్వామి



'జగనన్న ఎందుకు కావాలంటే' బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు

నంద్యాల టౌన్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు ఎప్పటికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటారని ఉప ముఖ్యమంత్రులు అంజాద్ బాషా, నారాయణస్వామి అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలో నూరజ్ గ్రాండ్ హోటల్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మేధావుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. మైనార్టీలకు అన్ని రంగాల్లో లబ్ధి చేకూర్చేందుకు కాంపోనెంట్ ఆక్ట్ – 2023 అమలుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. హక్కుల సాధనకు చట్టసభల్లో తమ వాణి వినిపించేందుకు మంత్రి వర్గంలో 17 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు స్థానం కల్పించడమే కాకుండా నలుగురికి డిప్యూటీ సీఎం హోదా కల్పించడం జగనన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రాష్ట్రం నుంచి రాజ్యసభకు 8 మందిని ఎంపిక చేస్తే వారిలో నలుగురు బీసీలకు అవకాశం ఇచ్చారన్నారు.

గాంధీజీ స్ఫూర్తితో జనరంజక పాలన

జాతిపిత మహాత్మా గాంధీని స్ఫూర్తిగా తీసుకొని జగనన్న జనరంజక పాలన కొనసాగిస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. పేదవాడి ఇంటి ముందుకే ప్రగతి ఫలాలు చేరడంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 30.50 లక్షల మందికి ఇల్లు మంజూరయ్యాయని, అమరావతిలో 50 వేల మంది పేదలకు స్థలాలు ఇచ్చారన్నారు. పేదల సొంతింటి కలను నిజం చేసేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఊరూరా జగనన్న కాలనీలను నిర్మిస్తే ఓర్వలేని టీడీపీ నాయకులు కోర్టులకు వెళ్లి స్టేలు తెచ్చి అడ్డుకుంటున్నారన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ జగనన్ననే పోటీ చేస్తున్నాడని ప్రజలు భావించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైనాట్ 175 లక్ష్యాన్ని వచ్చే ఎన్నికల్లో నెరవేర్చుతారన్నారు. ముఖ్యమంత్రి జగనన్నతోనే మన భవిష్యత్ బంగారుమయమవుతుందని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి అన్నారు. నంద్యాలలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతుందని మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడానికి సంఘటిత శక్తిగా మైనార్టీలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, రాష్ట్ర ముస్లిం మైనారిటీ సలహాదారు హబీబుల్లా, వైఎస్సార్ జిల్లా జెడ్పీ చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి, నంద్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, వైఎస్సార్‌సీపీ నాయకులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని..


బుక్య రాము నాయక్ (ఫైల్)

పాములపాడు: భార్య కాపురానికి రాలేదని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వాడాల గ్రామానికి చెందిన బుక్య రాముడా యక్(29) ఆరేళ్ల క్రితం వెలుగోడు మండలం గుంతకందాల గ్రామానికి చెందిన కల్యాణిబాయిని పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. కొన్నేళ్ల క్రితం దంపతుల మధ్య కలహాలతో కల్యాణిబాయి పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో మనస్తాపం చెందిన రాము నాయక్ శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు గమనించి 108లో ఆత్మకూరుకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ఆసుపత్రికి చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి కోటయ్యనాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు.

డ్రైనేజీ కాల్వలో పడి మృత్యువాత


మృతి చెందిన లక్ష్మణుడు

చాగలమర్రి: బైక్‌పై వెళ్తు ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ డ్రైనేజీ కాల్వలో పడి మృతి చెందాడు. మండల కేంద్రం చాగలమర్రిలోని భవానీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న లక్ష్మణుడు(22) శనివారం ఉదయం తన తల్లి రాజక్క గాజుల వ్యాపారానికి వెళ్తుండగా ఆమెను ముత్యాలపాడు బస్టాండు వద్ద బైక్‌పై వదిలాడు. ఇంటికి తిరిగి వస్తుండగా రచ్చబండ వద్ద బైక్ అదుపు తప్పి డ్రైనేజీ కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో లక్ష్మణుడు అక్కడికక్కడే మృతి చెందాడు.

మరింత 'పవర్' ఫుల్

- రూ.385.24 కోట్లతో నూతన విద్యుత్ ఉప కేంద్రాలు
- ఎమ్మిగనూరు, గడివేముల, చాగలమర్రి మండలాల్లో నిర్మాణం
- నిర్మాణాలకు గత నెలలో వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం జగన్


కర్నూలు జిల్లాలోని 33 కేవీ విద్యుత్ ఉప కేంద్రం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అత్యధిక సామర్థ్యం కలిగిన సబ్‌స్టేషన్లను నిర్మిస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒకేసారి రికార్డు స్థాయిలో రూ.385 కోట్లతో మూడు సబ్ స్టేషన్‌లను నిర్మిస్తున్నారు. వీటి నిర్మాణాలకు నవంబరు 22న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన కూడా చేశారు. నూతన విద్యుత్ సబ్ స్టేషన్‌ల నిర్మాణం, కొత్త లైన్ల ఏర్పాటుతో 15 మండలాలకు సంబంధించి లక్షలాది మంది వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందనుంది. అలాగే వ్యవసాయ రంగానికి పగటిపూటనే 9 గంటల నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా అందుతుంది. ఆయా ప్రాంతాల్లో పారిశ్రామిక రంగం వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది. లో వోల్టేజి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. విద్యుత్ సరఫరా నష్టాలు, అంతరాయం తగ్గుతుంది. విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సబ్ స్టేషన్‌లు నిర్మిస్తుండటంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

బనవాసిలో రూ.148 కోట్లతో నిర్మాణం

ఎమ్మిగనూరు మండలం బనవాసి ప్రాంతం పారిశ్రామికంగా, వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ రూ.148 కోట్లతో 220/132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణంతో ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం మండలాలకు చెందిన రెండు లక్షల మంది వినియోగదారులకు ఎన్నో రకాలుగా మేలు జరగనుంది.

ముత్యాలపాడులో రూ. 138.59 కోట్లతో..

నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం ముత్యాలపాడు గ్రామంలో రూ.138.59 కోట్లతో 220/131/33 కేవీ సబ్ స్టేషన్ నిర్మిస్తున్నారు. నిర్మాణం పూర్తయితే చాగలమర్రి, దువ్వూరు, చాపాడు, రుద్రవరం, శిరివెళ్ల, ఆళ్లగడ్డ ప్రాంతాలకు సంబంధించి విద్యుత్ లో వోల్టేజీ సమస్యలు పరిష్కారం అవుతాయి. అంతేగాక ఈ ప్రాంతం పారిశ్రామికంగా, వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ముత్యాలపాడులో నిర్మించే సబ్‌స్టేషన్‌తో ఆళ్లగడ్డ, రుద్రవరం ఉపకేంద్రాలపై అధిక లోడ్ తగ్గి విద్యుత్ సరఫరా మెరుగుపడనుంది.

గడివేములలో రూ.98.65 కోట్లతో..

నంద్యాల జిల్లా గడివేముల ప్రాంతంలో 2220/132/33 కేవీ సబ్ స్టేషన్ లేదు. ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. పారిశ్రామిక, వ్యవసాయ రంగాలతో పాటు గృహ అవసరాలకు సంబంధించి ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.98.65 కోట్లతో 2220/132/33 కేవీ సబ్ స్టేషన్‌ను గడివేముల మండలం కొర్రపోలూరు గ్రామంలో నిర్మిస్తున్నారు. దీని నిర్మాణం పూర్తయితే గడివేముల, వెలుగోడు, మిడుతూరు, బండిఆత్మకూరు, గడిగరేవుల, గని, రోళ్లపాడు, సంతజూటూరు, వేల్పనూరు, దుర్వేశి, ఊర్నపాడు ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. దాదాపు 2 లక్షల మంది వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందనున్నాయి. నంద్యాల విద్యుత్ ఉప కేంద్రం పైనున్న అధిక లోడు ప్రభావం తగ్గి విద్యుత్ సరఫరా మెరుగుపడనుంది.

నేటి రాత్రి ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు

బొమ్మలసత్రం: పోలీసులు డిసెంబర్ 31వ తేదీ రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు ముమ్మరంగా నిర్వహించనున్నారని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మైనర్లను తల్లిదండ్రులు రాత్రి 10 గంటల తర్వాత ఇంటి నుంచి బైటికి పంపవద్దని సూచించారు. వేడుకల పేరుతో మైనర్లు బైక్‌లపై తిరిగితే తల్లిదండ్రులు శిక్ష అనుభవించాల్సి వస్తుందన్నారు. వేడుకల పేరుతో బాణాసంచా, డీజేలతో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అధిక శబ్దం చేసే బైక్‌లపై విచ్చలవిడిగా యువకులు తిరిగితే ఆ బైక్‌లను సీసీ కెమెరాల ద్వారా గుర్తించి సీజ్ చేస్తామని హెచ్చరించారు. నేషనల్ హైవేపై బైక్ రేసులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. రహదారుల మధ్యలో కేక్‌లు కట్‌చేసి సంబరాలు చేయవద్దని, ఇళ్లలో కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య సంతోషంగా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. యువత మద్యం మత్తులో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఆస్తులు ధ్వంసం చేస్తే వారిపై కేసులు నమోదు చేసి ఆ సంస్థలకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

యువకుడి దారుణ హత్య

- మద్యం మత్తులో స్నేహితుడి ఘాతుకం
- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు


హత్యకు గురైన అస్లాం (ఫైల్)

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలో దారుణం చోటు చేసుకుంది. మద్యం మత్తులో స్నేహితుడే ఓ వ్యక్తిని కత్తితో పొడిచి హత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చాగమర్రి భవానీ నగర్‌కు చెందిన కారు డ్రైవర్ అస్లాం (22), గౌండ సుభహాన్, పెయింటర్ సాధిఖ్ స్నేహితులు. సాధిక్ తల్లి చనిపోగా, తండ్రి పీర్‌బాషా కువైట్‌లో ఉంటున్నాడు. సుభహాన్ తల్లి చనిపోగా ఇతడు తండ్రితో కలిసి ఉంటూ జులాయిగా తిరుగుతున్నాడు. సాదిక్ ఇంట్లో ఒక్కడే ఉండటంతో తరచూ స్నేహితులు అతని ఇంట్లోనే మద్యం సేవిస్తూండేవారు. ఈ క్రమంలో ఏమి జరిగిందో తెలియదు కాని.. అస్లాంను హత్య చేశానంటూ సుభహాన్ శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో పోలీసులకు విషయం చెప్పి లొంగిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రమణయ్య వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. శనివారం ఉదయం ఆళ్లగడ్డ సీఐ హనుమంతనాయక్ చాగలమర్రికి చేరుకుని అస్లాం మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డకు తరలించారు. కాగా హత్యకు కారణాలుపోలీసులు వెల్లడించడం లేదు.

పథకం ప్రకారమే హత్య?

కారు డ్రైవర్ అస్లాంను పథకం ప్రకారమే హత్య చేసినట్లు తెలుస్తోంది. సంఘటన స్థలాన్ని పరిశీలించగా అస్లాం రక్తం మడుగులో పడిపోయి ఉన్నాడు. కత్తితో గొంతు కోయడంతో పాటు గుండె భాగంలో నాలుగైదుసార్లు పొడిచిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. హత్య చేశానని చెబుతున్న సు భహాన్, హతుడు అస్లాం దగ్గరి బంధువులు. కా గా హత్య జరిగిన రోజు సాధిక్ ఇంట్లో కొత్త వ్యక్తులు ముగ్గురు మద్యం సేవించినట్లు సమాచారం. హత్య జరిగిన సమయంలో తను ఇంట్లోలేనని, బంధువుల ఇంటిలో భోజనం చేయడానికి వెళ్లానని సాధిక్ చెబుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

శివాలయం జీర్ణోద్ధరణకు రూ. 1.25 కోట్లు

డోన్ టౌన్: వెంకటాపురం గ్రామంలో పురాతన శివాలయం జీర్ణోదర్ధరణకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో రాష్ట్ర ప్రభుత్వం రూ.1.25 కోట్లు మంజూరు చేసింది. ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన నెల్లూరు జిల్లా విజిలెన్స్ శాఖ ఏఎస్పీ కల్లూరు రాజేశ్వరరెడ్డి తన వంతుగా రూ.25 లక్షలు ప్రభుత్వానికి చెల్లించడంతో దేవదాయ ధర్మదాయ శాఖ నుంచి రూ. కోటి ప్రభుత్వం మంజూరు చేసింది. ఆలయ అభివృద్ధిపై శనివారం రాజేశ్వరరెడ్డి గ్రామస్తులతో సమవేశమయ్యారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన స్థల సేకరణపై చర్చించారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో రామకృష్ణారెడ్డి, గ్రామస్తులు మధుసూదనరెడ్డి, రంగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చిన్న పెద్దయ్య, చంద్రన్న, నాగన్న, పాపయ్య, చిట్యాల నాగరాజు, కేశన్న, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో ఏఎస్పీ రాజేశ్వరరెడ్డి

తహసీల్దార్లకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ


ల్యాప్‌టాప్‌లు అందుకున్న తహసీల్దార్లలో జిల్లా కలెక్టర్ శామూన్, జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో తహసీల్దార్లు కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో వారి సేవలు మరింత విస్తృత పరిచేందుకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ అధికారుల సమీక్ష అనంతరం అన్ని మండలాల తహసీల్దార్లకు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్యలు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నంద్యాల నూతన జిల్లాగా ఏర్పాటైనప్పటి నుంచి వసతులు, సిబ్బంది కొరత ఉన్నప్పటికీ తహసీల్దార్లు ప్రజలకు సర్వీసులు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పనులను నిర్ణీత కాల పరిమితిలోగా పూర్తి చేయడంతో పాటు ప్రముఖుల పర్యటనలకు అత్యవసర సేవలు అందించడంలో కూడా రెవెన్యూ అధికారుల పాత్ర కీలకమైందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని తహసీల్దార్లు మరిన్ని సేవలు ప్రజలు మెచ్చే రీతిలో అందించేందుకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశామన్నారు.

ఉరుకుందకు 'డిప్యూటీ' హోదా

మంత్రాలయం: దేవదాయ శాఖ పరిధిలో ఉన్న ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం స్థాయి పెరిగింది. ఈ క్షేత్రానికి డిప్యూటీ కమిషనర్ హోదా కల్పి స్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆలయం 1973లో దేవదాయ శాఖ పరిధిలోకి వచ్చింది. అప్పటి నుంచి పాలక మండలి వ్యవస్థ ఏర్పాటైంది. ఇప్పటి వరకు 9 పర్యాయాలు పాలక మండలి ఏర్పడింది. కార్యనిర్వాహణ అధికారి హోదాలో 1997 వరకు ఆలయ పాలన సాగింది. క్షేత్రం దినదినాభివృద్ధి చెందడంతోపాటు ఆదాయం పెరగడంతో 1997లో అసిస్టెంట్ కమిషనర్ హోదా కల్పించారు. స్వామి దర్శనానికి భక్తులు వేలాది తరలి వస్తుండటంతో జిల్లాలో ప్రముఖ క్షేత్రంగా ఉరుకుంద విరాజిల్లుతోంది. ఏటా కోట్లాది రూపాయల్లో ఆదాయం వస్తోంది. ఈ నేపథ్యంలో క్షేత్రాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ కమిషనర్ హోదాను కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

క్షణికావేశం మృత్యుపాశమై

- ఇద్దరు బిడ్డలను హతమార్చిన తల్లి
- అనంతరం ఆత్మహత్యాయత్నం
- హాల్విలో విషాదం


ఆదోని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శారద


వెంకటేష్ (ఫైల్),


భరత్ (ఫైల్)

మంత్రాలయం/కౌతాళం : వచ్చీరాని మాటలతో అమ్మా.. అమ్మా అంటూ పిలిచే మూడేళ్ల బాలుడు ఒకడు.. ఉంగా.. ఉంగా అంటూ తల్లి పొత్తిళ్లలో వెచ్చగా సేదతీరే ఆరు నెలల బాలుడు ఇంకొకడు.. ఆకలేసి వీరు అల్లాడుతుంటే కన్నీరు కార్చే తల్లి.. వారు లేకుండా కొన్ని నిమిషాలు కూడా ఉండలేని మాతృమూర్తి.. బిడ్డలే భవిష్యత్తుగా బతుకుతున్న అమ్మ.. ఏం కష్టమొచ్చిందో.. మనసుకు ఎక్కడ గాయం అయ్యిందో.. హృదయం ఎక్కడ ముక్కలైందో.. క్షణికావేశంలో ఇద్దరు కన్న బిడ్డలను నిర్దాక్షిణ్యంగా హతమార్చింది. తను కూడా ఆత్మహత్యకు యత్నించింది. ఈ విషాద ఘటన కౌతాళం మండలం హాల్వి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. హాల్వి గ్రామానికి చెందిన బోయ రామకృష్ణకు కోసిగి మండల అర్లబండకు చెందిన శారదతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వ్యవసాయం చేసుకుని జీవనం సాగించే వీరికి కుమారులు వెంకటేష్ (3 ఏళ్లు), భరత్ (6 నెలల) ఉన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకున్న శారద ఐదు నెలలుగా పుట్టింటిలో ఉంటోంది. గ్రామ దేవత విగ్రహ ప్రతిష్టాపన ఉండటంతో ఇటీవల హాల్వి గ్రామానికి వచ్చింది. ఆపరేషన్ చేసుకున్న భార్య పనులు చేయడం భావ్యం కాదని భర్త యోచించి.. పుట్టింటిలో వదిలి వస్తానని శుక్రవారం రాత్రి చెప్పాడు. శనివారం ఉదయం లేచి పొలానికి వెళ్లి రాత్రి ఇంటికి వచ్చి నిద్రిస్తుండగా.. చిన్న పిల్లవాడు భరత్ అరుపులు వినిపించాయి. ఇంటి బయటకు వెళ్లి చూడగా భార్య శారద నీటి బకెట్లో పిల్లాడిని ముంచుతూ కనిపించింది. అప్రమత్తమై బాలుడిని చికిత్స నిమిత్తం గ్రామంలోని వైద్యుని దగ్గరికి తీసుకుని వెళ్లగా అప్పటికే మృతి చెందాడు. అనుమానం వచ్చిన రామకృష్ణ సోదరుడు ఇంటికి వెళ్లి చూడగా పెద్ద పిల్లాడు వెంకటేష్ నోటి నుంచి నురుగు రావడంతో హుటాహుటిన వైద్యుని వద్దకు తీసుకుని వెళ్లగా అప్పటికే మృతి చెందాడు. పెద్ద కుమారుడికి వెంట్రుకలకు రాసే వ్యాస్‌మోల్ తాపి తాను కూడా తాగి శారద అపస్మారకస్థితికి వెళ్లింది. ఆమెను ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకుంటోంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని, కుటుంబ సభ్యుల సమాచారం మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.